# మూగజీవాలు భద్రం!

- వేసవిలో పశు సంరక్షణ తప్పనిసరి
- పాడి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచనలు

**ప్రత్తిపాడు:** వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాయి. సహజంగా 16 నుంచి 22 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు పశువులకు సౌకర్యంగానే ఉంటుంది. ఆపై అధిక ఉష్ణోగ్రత నమోదైతే పశువులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ప్రధానంగా వడదెబ్బ కారణంగా పశువులు మృతి చెందే అవకాశం ఉంటుంది. అందుచేత పాడి రైతులు పశువుల సంరక్షణపై ప్రత్యేక మెలకువలు పాటించాలి. వేసవిలో పశువుల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యులు సూచిస్తున్నారు.

**తగ్గనున్న వ్యాధి నిరోధక శక్తి**

వేసవిలో పశువులకు కావాల్సిన మేత దొరకదు. దీనివల్ల పోషకాహార లోపం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీని కారణంగా గొంతువాపు, గాలికుంటు, జబ్బవాపు వ్యాధులు సోకే అవకాశం ఉంది. దీంతో పాటు కలుషితమైన నీరు తాగడం, ఆ నీటిలో పశువులను కడగడం వల్ల అంతర, బాహ్య పరాన్న జీవుల సమస్యలు అధికమవుతాయి. ఈ వ్యాధులు రాకుండా పాడి రైతులు వేసవి ప్రారంభంలోనే ప్రతి పశువుకు టీకాలు వేయించాలి. అంతర, బాహ్య పరాన్న జీవుల నివారణకు నట్టల మందులు వేయించాలి. సమతుల్యమైన పోషకాలు కలిగిన ఆహారం, పరిశుభ్రమైన నీరు తగిన మోతాదులో పశువులకు అందించాలి.



ఎండలోనే పశువులు

**వడదెబ్బ తగలకుండా..**

పశువులను మేత కోసం పొలాలు, సమీప అడవుల్లోకి తీసుకువెళతారు. వేసవిలో అధిక వేడిని తట్టుకోలేక వడదెబ్బకు గురవుతాయి. పశువులు ఎక్కువ సమయం ఎండలో ఉండడం, తాగునీరు పూర్తిస్థాయిలో లభించకపోవడం వల్ల స్పృహకోల్పోతాయి. పశువు శరీర ఉష్ణోగ్రత, శ్వాస, వాడి వేగం బాగా పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో అపస్మారక స్థితికి చేరుకుని సమయంలో వెంటనే చల్లని ప్రదేశానికి గానీ, షెడ్ లోకి గానీ తీసుకువెళ్లాలి. తడి చేసిన గోనె సంచి లాంటి దాన్ని కానీ, తడి గుడ్డని కాని వడదెబ్బ తగిలిన పశువుల చుట్టూ కప్పి, పశువు కోలుకునే వరకు తడుపుతూ ఉండాలి. పశువు తాగినంత నీరు, ప్రథమ చికిత్స అందించాలి. ప్రధానంగా ఉదయం 6 గంటల నుంచి 11 గంటలు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్యలో పశువులను మేత కోసం బయటకు తీసుకువెళ్లాలి. మిగిలిన సమయంలో పాకలో కట్టేసి మేపడం చాలా మంచిది. అందుబాటులో చెరువులు, నీటి కుంటలు ఉంటే వాటిలో పశువులను ఎక్కువ సేపు ఉంచాలి.



పశువులకు ముందస్తు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి వీరలక్ష్మి

**అధికంగా నీరు, ఆహారం**



వేసవిలో మూగజీవాలు వడదెబ్బ బారిన పడే అవకాశాలున్నాయి. వడదెబ్బ తగిలితే తక్షణమే చల్లని ప్రదేశానికి తీసుకువెళ్లాలి. వడదెబ్బ తగిలిన పశువులకు వైద్యం అందించాలి. వేసవిలో పశువులు నీరు ఎక్కువగా తీసుకుని, ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు తాగే నీరు పుష్కలంగా, పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. నీరు అన్ని వేళలా పశువులకు అందుబాటులో ఉండేలా చూడాలి. ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పగటి పూట పచ్చగడ్డి, దాణా మిశ్రమాన్ని ఇచ్చి, రాత్రి ఎండుగడ్డి ఇవ్వాలి. ముందు జాగ్రత్తలు తీసుకుంటే మూగజీవాలు వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. దీనిపై గ్రామాల్లో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ.

## జగన్‌ను కలిసిన యనమల కృష్ణుడు



తాడేపల్లి కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన యనమల కృష్ణుడు

**తుని:** తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని యనమల కృష్ణుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అధినేత ఆదేశించారన్నారు. తుని మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యను అందించాలి

**ఏలేశ్వరం:** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు తిరుమాలి గ్రామంలో మంగళవారం క్లాస్‌రూమ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రోగ్రాంను ఎంపీపీ ప్రారంభించారు. ఒకటో తరగతిలోని చేరే విద్యార్థులకు కరచాలనం చేసి స్వీట్లు పంచి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ప్రతిభ చూపిన ఉపాధ్యాయుడు తూమురౌతు శ్రీనివాసరావును ఎంపీపీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంఈఓలు అబ్బాయి, వరలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు పసల సూరిబాబు, సూతి బూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఉపకరణాల పంపిణీ



దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎంపీపీ బుజ్జి

**ఏలేశ్వరం:** దివ్యాంగ విద్యార్థులకు పట్టణంలో మంగళవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. కాకినాడ సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఆలింకో సంస్థ ద్వారా స్థానిక భవిత కేంద్రంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి చేతుల మీదుగా ఐదు వీల్‌ఛైర్లు, ఏడు చెవిటి మిషన్లు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంఈఓలు అబ్బాయి, వరలక్ష్మి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, సిబ్బంది వాణిపద్మజ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

**శంఖవరం:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 10 మంది ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థులకు ఆలింకో సంస్థ వారి వీల్ ఛైర్లు, చెవి మెషీన్లను ఎంపీపీ పర్వత రాజబాబు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎస్ఎంకెజీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ రాజబాబు మాట్లాడారు.

### ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి బదిలీ

**ప్రత్తిపాడు:** స్థానిక ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను అనంతపురం జిల్లా కల్యాణదుర్గ్ బదిలీ అయ్యారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులిచ్చినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి.

### సత్యదేవుని దర్శించిన దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్



వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ దంపతులు

**అన్నవరం:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవాలయాన్ని దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్ దంపతులు మంగళవారం దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను చైర్మన్ అందజేశారు.

### జిల్లా అభివృద్ధికి కృషి

**గండేపల్లి:** కాకినాడ జిల్లా అభివృద్ధికి కృషి చేయనున్నట్టు కౌడా చైర్మన్ తుమ్మల బాబు తెలియజేశారు. మంగళవారం గండేపల్లి మండలం సూరంపాలెం, పెద్దాపురం పరిధిలో కౌడా పరిధిలో లే అవుట్లు, నాన్ లేఅవుట్లను ఆయన పరిశీలించారు. అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కౌడా వైస్ చైర్మన్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన, సెక్రటరీ కలిబాబు, ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, పెద్దాపురం తహసీల్దార్ వెంకటలక్ష్మి, రెవెన్యూ, కౌడా సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవితకు భరోసా

**ప్రత్తిపాడు రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు భవిష్యత్‌కు భరోసా లభిస్తుందని ఎంఈఓ వి.రాజబాబు అన్నారు. ఒమ్మంగిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. చదువు విలువ, పాఠశాల్లో వసతులను వివరిస్తూ విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ, ప్రధాన కూడలిలో మానవహారంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు వై వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### శంఖవరంలో మొక్కల పంపిణీ

**శంఖవరం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆడబిడ్డలకు, 57 మంది తల్లులకు ఎంపీపీ పర్వత రాజబాబు చేతుల మీదుగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజబాబు మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో కార్యక్రమం పిల్లల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ఎంకెజీ ప్రసాద్, ఐసీడీఎస్ విస్తరణాధికారి వీవీ అరుణశ్రీ, బద్ది రామారావు, పర్వత సురేష్, మేడిశెట్టి కిరణ్, వెన్న శివ, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీలో వైద్య సేవలపై ఆరా

**గండేపల్లి:** జగ్గంపేటలో గుర్రప్పాలెం వెళ్లే మార్గంలోని పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ ఆరాతీశారు. మంగళవారం ఆయన పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసి రోగులను స్వయంగా పలకరించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నేతలు జీను మణిబాబు, వేముల కొండ జోగారావు, అడబాల వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు. యల్లమిల్లి దళితవాడలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు.

## ఘనంగా సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం



ఏలేశ్వరంలో చారుమజుందార్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీశ్రేణులు

**ఏలేశ్వరం:** సీపీఐ(ఎంఎల్) 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ పిలుపు మేరకు ఏలేశ్వరం, పరిమితడక, జె.అన్నవరం, లింగంపర్తి తదితర గ్రామాల్లో చారుమజుందార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీనాయకులు మాట్లాడుతూ సీపీఐ(ఎంఎల్)పార్టీ బలోపేతం చేసేందుకు చారుమజుందార్ వంటి కామ్రేడ్‌లు అనేక పోరాటాలు చేశారన్నారు. కామ్రేడ్ పోరాటాల ఫలితంగా అనేకమంది పేదలు లబ్ధిపొందారన్నారు. చారుమజుందార్ జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, పిల్లా కాంతం, గుమ్మడి పాదాలమ్మ, కందుల వరలక్ష్మి, చందక లక్ష్మి, గూనాపు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు:** లంపకలోవ గ్రామంలో మంగళవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. లిబరేషన్ లోకల్ కమిటి కార్యదర్శి రాజాల రత్నం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా లిబరేషన్ రాష్ట్ర కమిటి సభ్యుడు మానుకొండ లచ్చబాబు మాట్లాడుతూ 1969లో భారత సమాజంలో పేదల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పార్టీ ఏర్పడిందన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలో మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి, కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెడుతున్నారంటూ ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోన్న లిబరేషన్ పార్టీకి ప్రజల మద్దతు ఇవ్వాలని మానుకొండ లచ్చబాబు కోరారు. కార్యక్రమంలో లిబరేషన్ ఏరియా కార్యదర్శి తాడి నాగేశ్వరరావు, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు మాసా రాజామణి, బీరా దేవతయ్య, చిన్నం లచ్చబాబు, కాకర రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

**అమరవీరుల ఆశయసాధనే లక్ష్యం**

**ప్రత్తిపాడు రూరల్:** భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం విరోచిత పోరాటం చేసి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయి నిలిచిపోయిన అమరవీరుల ఆశయసాధనే లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు గిరిజన సంఘం నాయకులు ఉల్లి తాతారావు అన్నారు. వంతాడ గిరిజన గ్రామంలో సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో సీపీఐ ఎంఎల్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఉల్లి తాతారావు, కుడే రాఘువ, మాతే దుర్గ బాబు, మాతే లోవరాజు, మాతే రామకృష్ణ, కుడే పెద్ద రాజబాబు, ఉల్లి లవకుశ తదితరులు పాల్గొన్నారు.

## నల్లరాయి క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ



ఎస్.పైడిపాల సమీపంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

**రౌతులపూడి:** ఎస్.పైడిపాల సర్వే నంబరు–15లో 7.707 హెక్టార్లు, ములగపూడి సర్వే నంబరు–1లో 4 హెక్టార్లలో నల్లరాయి క్వారీ నిర్వహణ కోసం ఎస్.రామరాజు, ఎస్.సత్యనారాయణరాజు అసోసియేట్స్ పేరుతో పెట్టుకొన్న దరఖాస్తులపై అధికారులు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎంబీఎస్ శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి పర్యవేక్షణలో జరిగింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎన్జీవోలు, స్థానికుల నుంచి ప్రజాభిప్రాయాలను సేకరించారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలుగకుండా, క్వారీ నిర్వహణ కారణంగా ప్రజలు నివశిస్తున్న ఇళ్లు దెబ్బతినకుండా నైపుణ్యత, నిర్దేశిత ప్రమాణాలు కలిగిన వారితో బ్లాస్టింగ్ చేపట్టాలని, స్థానికులకు ఉపాధి, మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు, ప్రజలు కోరారు. దీంతో పర్యావరణానికి ఏ విధమైన హాని కలగకుండా, ఉపాధి, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని యాజమాన్యాలు హామీ ఇచ్చారు. సంబంధిత నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తహసీల్దారు ఎస్వీ నరేష్, ఎస్ఐ బి.వెంకటేశ్వరరావు, ఎన్విరానిమెంట్ అధికారి ఎస్వీ రామలింగం, ఆర్ఐ పట్నాయక్, వీఆర్ఓలు చందు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ



కుళ్లిపోయిన కోడిగుడ్లు

**కోటనందూరు:** అల్లిపూడి ఓ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. బాలింతకు ఇలాంటి గుడ్లు పంపిణీ చేయడమేంటని లబ్ధిదారు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకెళితే.. అల్లిపూడి–3 అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో పెదపాత్రుని నాగమణి లబ్ధిదారు( బాలింత), అంగన్‌వాడీ సిబ్బంది ఏప్రిల్‌కు సంబంధించి నాగమణికి ఈ నెల 4న రేషన్ అందజేశారు. ఈ నెల 21న మరోసారి గుడ్లు పంపిణీ చేశారు. ఈ నెలలో ఒకసారి ఇచ్చారు కదా మళ్లీ ఇస్తున్నారేంటని లబ్ధిదారు ప్రశ్నించగా ఇవి మే నెలకు సంబంధించినవని సమాధానమిచ్చారు. నాగమణి ఇంటికి తీసుకెళ్లిన 30 గుడ్లలో 10 ఉడికించగా అన్ని కుళ్లిపోయాయి. ఇలాంటి గుడ్లు ఇచ్చారేంటని అంగన్‌వాడీ వర్కర్‌ను ప్రశ్నించగా సక్రమంగా సమాధానం చెప్పలేదని తెలిపారు. మిగిలిన గుడ్లు అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చేసినట్లు నాగమణి తెలిపారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేయాలని డిమాండు చేశారు. దీనిపై అంగన్‌వాడీ వర్కర్‌ను వివరణ కోరగా ఈ నెల ఎక్కువ గుడ్లు రావడంతో మేలో ఇవ్వాల్సిన గుడ్లు ఈ నెలలో ఇవ్వాల్సి వచ్చిందని, పాడైపోయిన గుడ్ల స్థానంలో మంచిగుడ్లు అందజేస్తామని చెప్పారు.

### ఈ నీరు తాగేదెలా..



ప్రత్తిపాడు ఐదో వార్డులో కుళాయిల నుంచి వస్తున్న కలుషిత నీరు

**ప్రత్తిపాడు:** కుళాయిలు నుంచి మురికినీరు వస్తోంది. దీనికి తోడు కంపు ఒకటి. అసలే వేసవి మండుతోంది. గొంతెండిపోతోంది. గ్రామ పంచాయతీ సరఫరా చేసే రక్షిత నీరు కలుషితమవుతోంది. ఇలా మురుకినీరు అందిస్తే గొంతు ఎలా తడుపుకొనేదని ప్రత్తిపాడు గ్రామంలోని ఐదో వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మంచినీటి కుళాయిలకు నీటిని సరఫరా చేసే పైపు లైన్లు డ్రైనేజీల్లో ఉండడమే కారణమని గ్రామస్తులు చెబుతున్నారు. మంగళవారం ఆ వార్డులో కుళాయిల నుంచి కలుషిత నీరు రావడమే కాకుండా దుర్గంధం వెదజల్లుతోందని వారు చెబుతున్నారు. గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా సురక్షితమైన తాగునీటిని అందించాలని ఎంపీటీసీ సభ్యుడు సీంద్రపు భాస్కరరావు కోరుతున్నారు.

### మావోయిస్టు పార్టీలతో చర్చలు జరపాలి

**గండేపల్లి:** కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీలతో చర్చలు జరపాలని ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ డిమాండ్ చేశారు. వీఐ లెనిన్ 155వ జయంతి సందర్భంగా జగ్గంపేటలో మంగళవారం ర్యాలీ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు లెనిన్ జయంతి రోజు సీపీఐ (ఎంఎల్) పార్టీ ఆవిర్భవించిందని, సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధమని ఆయన వివరించినట్టు పేర్కొన్నారు. డిమాండ్లతో కూడిన ప్లకార్డులతో స్థానిక ట్రావెల్స్ బంగ్లా నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా సాగిన ఈ ర్యాలీలో సంఘ నాయకులు అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, సతీష్, రామలింగేశ్వరరావు, సురేష్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం



రౌతులపూడిలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ పీడీ విజయకుమారి

**రౌతులపూడి:** గర్భిణులు, బాలింతలు మెరుగైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రౌతులపూడిలో మంగళవారం గర్భిణులు, బాలింతలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అంగనవాడీ కేంద్రాల్లోని ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్‌డే జరిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆడపిల్ల పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య, ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి జానకీలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరావు, పైల వేణుగోపాల్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలి**

**ప్రత్తిపాడు రూరల్:** బాలికలు ఆరోగ్యకరమై జీవనశైలిని అవవర్చుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. రాచపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, పౌష్టికాహారంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ చక్రవేణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సేవే ఉన్నత స్థాయికి దోహదం

- సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖల అధికారుల డుమ్మా



ఎంపీడీఓను సన్మానిస్తున్న ఎంపీపీ, తదితరులు

**గండేపల్లి:** ప్రజాసేవే ప్రభుత్వ అధికారులు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు దోహదపడతుందని వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం జరిగింది. మండల ఎంపీడీఓ నాతి బుజ్జి ప్రమోషన్‌పై ఎస్ఆర్జీఎస్ విజిలెన్స్ జిల్లా అధికారిగా బదిలీపై ఏలూరు వెళుతున్న సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగిగా ఏ రంగంలో పనిచేసినప్పటికి ప్రజలకు అందుబాటులో ఉంటూ సరైన సేవలందించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. గండేపల్లి మండల అభివృద్ధి అధికారిగా వచ్చి సుమారు ఏడు నెలల్లో ప్రమోషన్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సమావేశానికి రాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు**

మూడు నెలలకొసారి జరిగే సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేయనున్నట్టు ఎంపీపీ తెలియజేశారు. గ్రామాలలో జరగాల్సిన అభివృద్ధి, జరిగిన అభివృద్ధి, వివిధ శాఖల అధికారులతో చర్చపై నిర్వహించిన ఈ కార్యక్రమానికి పోలీస్, ఎక్సైజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతోపాటు మరికొన్ని శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వారిపై పిర్యాదు చేయనున్నట్టు ఎంపీడీఓ తెలియజేశారు.

### ఎక్సైజ్ దాడులు

**ప్రత్తిపాడు:** స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంఖవరం మండలం వజ్రకూటం గ్రామంలో మంగళవారం సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ కథనం మేరకు ఈదాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారని స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు.

## 2400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

**తొండంగి:** అన్నయ్యపేట గ్రామంలో 2400 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నవోదయం 2.0లో భాగంగా తుని స్టేషన్ లిమిట్స్‌లో అన్నయ్యపేట గ్రామంలో ఈఎస్‌టీఎఫ్ సీఐ వెంకటలక్ష్మి, ఆమె సిబ్బంది, తుని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శాస్త్రి, సిబ్బంది సారా తయారీకి ఉపయోగించే 2400 లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు ఎస్సై చౌదరి తెలిపారు.

## ఘనంగా ధరిత్రి దినోత్సవం



గండేపల్లిలో విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య అధ్యాపకులు





రంపయర్రంపాలెంలో విద్యార్థులు తయారు చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం ప్రమీలారాణి

**గండేపల్లి:** సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ధరిత్రి దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యావరణ సంస్థ 1970లో ధరిత్రిని కాపాడుకోవాలని ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా సూరంపాలెం, యర్రంపాలెం ప్రభుత్వ స్కూల్స్, ఆదిత్య విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మొక్కలు నాటిన ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, డీన్ ప్రో వి.సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి కె.అశోక్ కుమార్, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత టి.గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

**గోకవరం:** రంపయర్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని ప్రమీలారాణి ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి భూమి ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఉన్న ప్రతి చెట్టుకు డిజిటల్ క్యూఆర్ కోడ్‌ని విద్యార్థులతో తయారు చేయించారు. జిల్లా ఎస్‌జీసి కోఆర్డినేటర్ జి.ఆంజనేయులు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీను, ఉపాధ్యాయులు నారాయణ, ప్రసాద్, రాంబాబు, భూషణం, కుమారి, సరళకుమారి, హెప్సిబా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఏసుక్రీస్తు ప్రపంచ శాంతికి సోపానం

**ప్రత్తిపాడు రూరల్:** లోక రక్షకుడు ఏసుక్రీస్తు పునరుత్థానం, ప్రపంచ శాంతికి సోపానమై వర్ధిల్లుతోందని అంతర్జాతీయ ప్రసంగీకులు బ్రదర్ శామ్యూల్ కర్మోజి అన్నారు. ధర్మవరంలో క్రీస్తు దేవాలయం 18వ వార్షిక పునరుత్థాన మహోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కర్మోజి ప్రసంగిస్తూ క్రీస్తు బోధనలు అనుసరణీయం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీరాజు, మత పెద్దలు సీహెచ్ అబ్రహం శామ్యూల్, ఎం.ఇమ్మానుయేలు, జి.ప్రభాకర్, జాన్, బి జోసఫ్ పాల్గొన్నారు.

### ఘనంగా రామలింగేశ్వర స్వామివారి కల్యాణం

**గండేపల్లి:** నీలాద్రిరావుపేటలో బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి వారి కల్యాణం మంగళవారం ఘనంగా జరిగింది. స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని పండితులు వేదమంత్రోచ్చరణలతో నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ కావించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### జెర్సీ ఆవుకు కవల దూడల జననం



కవల దూడలు, జెర్సీ ఆవుతో దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర

**గోకవరం:** తంటికొండ గ్రామంలో ఓ జెర్సీ ఆవు కవల దూడలకు జన్మనిచ్చింది. వివరాల ప్రకారం.. తంటికొండ దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొరకు చెందిన జెర్సీ ఆవుకు మంగళవారం కవల దూడలు పుట్టాయి. పుట్టిన గంట నుంచి రెండు దూడలు ఆరోగ్యంగా చలాకీగా ఉన్నాయి. జన్యుపరమైన కారణంతో అరుదుగా కవల దూడలు జన్మిస్తాయని పశుసంవర్ధక శాఖ సిబ్బంది తెలిపారు.